క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రామకృష్ణాపురం సెక్రటరీ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను బుట్టల్లో వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలంతా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులున్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ముఖ మంటప నిర్మాణానికి విరివిగా విరాళాలు వస్తున్నాయి. శుక్రవారం స్వామివారికి జె. పంగులూరు మండలం ఆరికట్లవారిపాలెం గ్రామానికి చెందిన మాగులూరి ధశరథ రామాంజనేయులు, లక్ష్మి దంపతులు రూ.1,01,116 ను ఆలయ ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

మురుగు కాలువల్లో గంబూషియా చేపల విడుదల



కారంచేడులో గంబూషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

కారంచేడు: లార్వా వ్యాప్తిని నిరోధించేలా బాపట్ల కలెక్టర్, డీఎంహెచ్‌ఓల ఆదేశాల మేరకు మండలంలోని కారంచేడు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో మురుగునీటి కుంటల్లో గంబూషియా చేపలను విడుదల చేసినట్లు కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడుతో పాటు, కుంకలమర్రు గ్రామాల్లోని మురుగునీటి కుంటలను గుర్తించి వాటిలో ఉన్నతాధికారులు సరఫరా చేసిన ఈ చేపలను విడుదల చేశామన్నారు. ఈ చేపలను మురుగునీటి కుంటల్లో పేరుకుపోయిన పాచి, కుళ్ళిన తూటును కూడా ఈ చేపలు తింటాయన్నారు. అలాగే ఆ కుంటల్లో మురుగునీటి వలన వ్యాప్తి చెందే లార్వా పూర్తిగా నిర్వీర్యం అవుతుందన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో పాటు, ఎంపీడీఓ కె. నేతాజీ సూచనలతో ఈఓపీ ఆర్డీ రామ్మోహన్ సారధ్యంలో పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం చీరాల యూనిట్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. చీరాల తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశాన్ని ప్రకాశం అతిథి భవనంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.మురళీకృష్ణ, కార్యదర్శిగా పి.సాయికుమార్, కోశాధికారిగా డి.సులోచన, ఉపాధ్యక్షుడు, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, ఎన్నికల పర్యవేక్షకులుగా జి.సుబ్బారాయుడు, సహాయ ఎన్నికల అధికారిగా జి.యోబు వ్యవహరించారు. ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. చీరాల శేషుబాబు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీను, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం శ్రావణ మాసం శ్రవణ నక్షత్రం.. పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రజా ధనం వృథా..



షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న వాహనాలు



ఉపయోగంలో లేని ఆటో

- మూలనపడిన ఆటోలు, సామగ్రి

చీరాల: చీరాల పురపాలక సంఘంలో ఇంటింటికీ వెళ్లి చెత్త తరలించే వాహనాలు ప్రస్తుతం నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పక్షుల వ్యర్థాలతో నిండి తుప్పు పడుతున్నాయి. చీరాల పురపాలక సంఘంలో మొత్తం 33 వార్డులు ఉండగా వీటిలో ప్రతిరోజూ ఇళ్ళ నుంచి వచ్చే తడి, పొడి చెత్తను తరలించేందుకు గతంలో ఆటోలను వినియోగించేవారు. ఇంటింటికీ వచ్చి విజిల్ వేస్తూ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. అయితే చెత్త నిర్వహణకు ప్రస్తుతం ఆటోలను వినియోగించకుండా ట్రాక్టర్ల ద్వారానే చెత్తను తరలిస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఏడు ట్రాక్టర్లుతో 33 వార్డుల నుంచి సేకరించిన చెత్తను రామాపురంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే మూలన పడిన క్లాప్ ఆటో, వార్డుల్లో చెత్తను తరలించేందుకు వినియోగించే ట్రాలీలు, బుష్‌గార్డులను పక్కన పడవేశారు. వేలం వేసి వీటిని తొలగిస్తే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



పూనూరులో విశేష అలంకరణలో శ్రీలక్ష్మి అమ్మవారు



చీరాల: భక్తుల నివాసంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



పోతినవారిపాలెంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కారంచేడు: శ్రావణమాసంలో వరలక్ష్మీదేవికి వ్రతాలు ఆచరిస్తే, భర్త, కుటుంబం సంతోషంగా వర్ధిల్లుతారని మహిళా భక్తుల విశ్వాసం. దీంతో శ్రావణ శుక్రవారం ఆచరిస్తూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కారంచేడు పెద బజారుశివాలయం, మాధవస్వామి దేవాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, సాయి మందిరం, వైష్ణవీ దుర్గాలయం, గంగమ్మ తల్లి గుడితో పాటు మండలంలోని స్వర్ణ గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, పోతినవారిపాలెం, దగ్గుబాడు, ఆదిపూడి, యర్రంవారిపాలెంలో గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణ వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు ఆచరించారు. వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సుమారు 150 మందికి పైగా మహిళలు సామూహిక వరలక్ష్మీదేవీ వ్రతాలు ఆచరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యద్దనపూడి: శ్రావణమాసంలో వరలక్ష్మి దేవికి వ్రతాలు ఆచరిస్తే అష్టైశ్వర్యాలతో పాటు సౌభాగ్యం చేకూరుతాయని మహిళల విశ్వాసం. దీంతో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు వేకువజామునే తలస్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి అమ్మవారిని కలశంలోకి ఆవాహన చేసి వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం అష్టోత్తర శతనామాలతో వరలక్ష్మి దేవిని పూజించి షడ్రషోపేతమైన మహా నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి వారి నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. పూనూరులోని నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో, జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు.

చీరాల అర్బన్: శ్రావణమాసం మూడో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలను పట్టణ, గ్రామాల్లోని దేవాలయాలు, నివాస గృహాల్లో ఘనంగా నిర్వహించారు. వరాలిచ్చే వరలక్ష్మీ మమ్ములను చల్లగా దీవించు అంటూ భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. భక్తుల నివాసాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి విశేష అలంకరణలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలను సమర్పించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో, అమరావారి వీధిలోని శ్రీలక్ష్మీ భజన సమాజం, పేరాల శివాలయంలో, కస్తూర్బా బాలికోన్నతపాఠశాల సమీపంలో కనక మహాలక్ష్మి అమ్మవారి మందిరంలో, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వ్రతాలు, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.

బల్లికురవ: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా మండలంలోని కూకట్లపల్లి గ్రామంలోని రామాలయం, మహాలక్ష్మమ్మ చెట్టువద్ద సాయంత్రం లలితా పరమేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన చేపట్టారు. ఆదిపరాశక్తి అమ్మవారిని కుంకుమ పూజతో ఆరాధిస్తే అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని బొగ్గుల కొండ ఆశ్రమ పీఠాధిపతి అన్నారు. వేడుకల్లో భాగంగా గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన 109 మంది కుంకుమార్చనలో పాల్గొన్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో భాగంగా రామాలయంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాజా స్వామి పూజలు నిర్వహించారు.



స్వర్ణలో వరలక్ష్మీదేవి వ్రతాలు ఆచరిస్తున్న మహిళా భక్తులు



కూకట్లపల్లిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

వెన్నుపోటు కూటమి నైజం



క్యూ ఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటేష్‌బాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు
- రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ

చీరాల: కూటమి నేతల మాటలు విని ప్రజలు ఓటేసి గెలిపిస్తే చివరకు ప్రజలకు వెన్నుపోటు పొడవడం కూటమి నేతల నైజమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం చీరాల మండలం రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలను ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సుపరిపాలన పేరుతో ప్రజల వద్దకు వెళ్లి అన్ని అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హామీలను నెరవేర్చమని అడిగితే ఓర్వలేక మాటల దాడులకు దిగుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను ప్రజలకు అమలు చేసే విధంగా ఆందోళన బాట పడతామన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందినా ఓటు బ్యాంకు మాత్రం పార్టీకి తగ్గలేదన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. క్యూ ఆర్ కోడ్‌ను ఫోన్లలో స్కాన్ చేసి చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలు ఇవ్వక పోవడం వలన ప్రజలు ఏ విధంగా నష్టపోతున్నారో వివరించాలన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, చీరాల మండల పార్టీ అధ్యక్షుడు అద్దంకిరెడ్డి, గోలి నాగరాజు, తుమ్మా కోదండ రాముడు, దివి జయరాం, ఎం.గిరీష్, అందె సుబ్బారాయుడు, మాఘం శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, మెరుగు జాన్సన్, దాసరి సుధ, అలూరి వెంకటేశ్వర్లు, జంగిలి రాంబాబు, బక్క కుమార్, ఆసోది అంకాలరెడ్డి, జంగిలి రాంబాబు, బక్క కుమార్, బొడ్డు సుబ్బారావు, పి.శ్రీనివాసరావు, సాధు రాఘవ, పసుపులేటి కోటయ్య, షేక్ మస్తాన్, కావూరి రమణారెడ్డి, పి.ధనుంజయ్, ఎం.సీతామహాలక్ష్మి, శీలం వెంకటేశ్వరమ్మ, డి.మార్క్, గుర్రం సుబ్బారాయుడు, మాచర్ల ఆంజనేయులు, జి.సుధాకర్, డి.కుమార్‌బాబు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు

అదనపు లోడును క్రమబద్ధీకరించుకోండి

అద్దంకి రూరల్: అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగ దారులు ఈనెల 8 నుంచి డిసెంబర్ 31లకు అదనపులో 50 రాయితీతో క్రమ బద్ధీకరించుకోవాలని అద్దంకి డివిజన్ ఇంజినీరింగ్ అధికారి నల్లూరి మస్తాన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం మార్చి 1 నుంచి జూన్ 31 వరకు విద్యుత్ వినియోగదారులు 2982 సర్వీ సులకు అదనపులోడు క్రమబద్ధీకరించుకున్నారు. రూ. 90 లక్షలు డివిజన్‌కు వచ్చాయన్నారు. ఆగస్టు 8 నుంచి డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుందన్నారు.

డెంగీతో జాగ్రత్త

ఇంకొల్లు(చినగంజాం): డెంగీ వ్యాధి ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఇచ్చిన ఆదేశాలను సిబ్బందికి వివరించారు. డెంగీ జ్వరాన్ని వ్యాపింపజేసే దోమ జాతి ఎడిస్ ఈజిప్టీ, ఎడిస్ అల్బోపిక్టస్‌లని వీటిని డే బీటర్స్ అంటారని తెలిపారు. సాధారణంగా మానవ నివాసాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపిస్తాయని, దోమలు నిలువ ఉన్న మంచినీటిపై గుడ్లు పెడతాయని, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోపు కుడతాయని తెలిపారు. డెంగీ వచ్చిన రోగిని కుట్టిన దోమ మరొక వ్యక్తిని కుట్టినప్పుడు మాత్రమే డెంగీ సోకుతుందని.. అంటు వ్యాధి కాదని తెలియజేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ కుండా చూసుకోవాలని సూచించారు. జ్వరం సోకినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

వైభవంగా వరసిద్ది వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



స్వామికి పూజలు చేస్తున్న కరణం వెంకటేష్

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో వరసిద్ధి వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శ్రావణ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రెండు రోజులుగా ప్రత్యేక పుజలు నిర్వహించారు. అందిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలి



కారంచేడులో ఫీవర్ సర్వేలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పృధ్వీరాజ్

కారంచేడు: వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైరల్ ఫీవర్లు నమోదు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్ అన్నారు. శుక్రవారం కారంచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభించడం వలన ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో వివరించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి జ్వర పరీక్షల సర్వేను నిర్వహించాలన్నారు. ఈ ఫీవర్ సర్వే వలన గ్రామాల్లోని ప్రజలు ఎంత మంది జ్వరాలతో ఉన్నారో అర్థం అవుతుందన్నారు. తద్వార ఆప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల్లోను అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

బల్లికురవ: వర్షాలు కురుస్తుందున సీజనల్ వ్యాధులు జ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ జి. పాండురంగ స్వామి కోరారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు సీజనల్ వ్యాధులపై శుక్రవారం సమావేశం నిర్వహించారు.

కల్యాణ మండపం పునః నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న చెన్నరాయణ

చీరాల రూరల్: ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్య వైశ్య కల్యాణ మండపం పునః నిర్మాణానికి చెక్కా చెన్నరాయణ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వితరణ చేశారు. హైస్కూలు క్రీడా మైదానంలో కళ్యాణ మండప ప్రెసిడెంట్ చేబ్రోలు బాబాజీరావు, వైస్ ప్రెసిడెంట్ మద్దు వెంకట సుబ్బారావుకు రూ. 1,01,116 అందజేశారు. అలానే మహాదేవ వేద గోశాలకు రూ. 10,000 విలువ కలిగిన ఇనుప బీరువాను బహూకరించారు. గోవులకు తవుడు నిమిత్తం రూ. 1,116 అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, చెంగలరాయుడు, అమర్ చంద్, డీవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న నాయకులు

చీరాల: సీఎం సహాయ నిధి నుంచి 33 మంది లబ్ధిదారులకు రూ.39,90,544 నగదు చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చొరవతో నగదు చెక్కును లబ్ధిదారులకు అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని పార్టీ నాయకులు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్ర, మండల పార్టీ అధ్యక్షులు గంజి పురుషోత్తం, పిక్కి నారాయణ, జంగిలి రాముడు, శరత్, వల్లెపు వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



సీనియర్ సివిల్ జడ్జి సుధకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

చీరాల రూరల్: బ్రహ్మకుమారీస్ చీరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులకు బ్రహ్మకుమారీలు వారివారి కార్యాలయాలకు వెళ్లి రాఖీలు కట్టారు. స్థానిక శాసన సభ్యుడు మద్దులూరి మాలకొండయ్య, సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ గోపికృష్ణ, ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ శ్రీకాంత్, సబ్ రిజిస్ట్రార్‌తో పాటు పలువురు అధికారులకు రాఖీలు కట్టి సోదరీసోదరులు అనుబంధాన్ని గుర్తు చేశారు. బ్రహ్మకుమారీలు రజని, ధనలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

చంద్ర బాబు పాలనలో మోసం గ్యారెంటీ



జాగర్లమూడిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు

యద్దనపూడి: చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ అని గడచిన పాలనా కాలంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత ఆయనకు ఉందని యద్దనపూడి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావూరి వేణుబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని జాగర్లమూడి గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ వేణుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి బాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయక పోవడాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పర్చూరు మండల కన్వీనర్ కటారి అప్పారావు, ముప్పాల రాంబాబు, తమ్మా అమ్మిరెడ్డి, నక్కా పోలిరెడ్డి, చెంచిరెడ్డి, మధుకొండ శ్రీనివాసరెడ్డి, ఆళ్ళ చెంచురెడ్డి, అట్లూరి లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీహరి, తమ్ములూరి బూసి,గాదె ఉమారెడ్డి, తమ్ములూరి కోటయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



వైభవంగా శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాం భావన్నారాయణ స్వామి ఆలయంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి తిరు నక్షత్రం(జన్మ నక్షత్రం)శ్రవణం పురస్కరించుకొని శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు తిరుమల స్వామి వారి సంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ కల్యాణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు జి. పిచ్చయ్య, పద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.